ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
సోమవారం 18 నవంబరు 2024

ప్రతి సోమవారం మండల, మున్సిపాలిటీల్లో ఫిర్యాదుల స్వీకరణ

కడప కలెక్టరేట్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఇక ప్రతి సోమవారం కలెక్టరేట్‌తో పాటు మండల, మున్సిపల్ స్థాయిలో నిర్వహించనున్నామని కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ ఫిర్యాదులను సమీపంలోని మండల, మున్సిపల్ కార్యాలయాల్లో సమర్పించి పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రజలకు పాలనను మరింత చేరువ చేయడానికి ప్రజా ఫిర్యాదుల వ్యవస్థను వికేంద్రీకరించామని కలెక్టర్ తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఫిర్యాదుదారులు ఆధార్‌తో హాజరు కావాలి

కడప క్రైం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయానికి సోమవారం వచ్చే ఫిర్యాదుదారులు తప్పకుండా ఆధార్ కార్డుతో హాజరు కావాలని జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ప్రజలు పోలీసులకు సహకరించాలని సూచించారు.

అసెంబ్లీకి వెళ్తారా.. రాజీనామా చేస్తారా

- జగన్‌ను ప్రశ్నించిన తులసిరెడ్డి
- వైసీపీ, టీడీపీ దొందూదొందే అంటూ ఎద్దేవా



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న తులసిరెడ్డి

పులివెందుల టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు, పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీ కన్నా పోవాలి లేకుంటే రాజీనామా అయినా చేయాలని కాంగ్రెస్‌పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి ధ్వజమెత్తారు. ఆదివారం పులివెందుల పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇంతకాలం వైసీపీ అరచేతిలో వైకుంఠం చూపిస్తే ఇప్పుడు టీడీపీ కూటమి కైలాసం చూపిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ 6 హామీలు అట్టర్ ఫ్లాప్ అయ్యాయన్నారు. బడ్జెట్‌లో నిరుద్యోగ భృతి ఊసే లేదన్నారు. తల్లికి వందనం హామీకి రూ.12,600 కోట్లు కావలసి ఉండగా రూ.5,387 కోట్లు మాత్రమే కేటాయింపు, అన్నదాత సుఖీభవ పథకానికి రూ.10,717 కోట్లు కావలసి ఉండగా రూ.4,500 కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. ఆడబిడ్డ నిధి కింద రూ.32,400 కోట్లు అవసరం అయితే కేటాయంపులు సున్నా అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకానికి కేటాయింపులు లేవన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీలకు 50ఏళ్లకే పెన్షన్ పథకానికి రూ.8,160 కోట్లు కావలసి ఉండగా దానికీ కేటాయింపులు లేవన్నారు. ఇచ్చిన హామీలను కూటమి అమలు చేయడం లేదని.. దీనిని ప్రశ్నించాల్సిన ప్రతిపక్ష వైసీపీ నేత జగన్ అసెంబ్లీకి పోవడం లేదని అన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ సమన్వయకర్త ధ్రువకుమార్‌రెడ్డి, తొండూరు, లింగాల, వేంపల్లె, సింహాద్రిపురం, పులివెందుల కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

- అంగన్వాడీ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా

కడప నాగరాజుపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మినీ అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలంటూ ఆదివారం కడప కలెక్టరేట్ వద్ద ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ మాట్లాడుతూ అంగన్వాడీలతో పాటు సమానంగా జీతం ఇస్తామని సమ్మె సమయంలో తెలిపారన్నారు. కానీ ఇప్పటికీ ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసులరెడ్డి, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి బి.లక్ష్మీదేవి మాట్లాడుతూ వీరికి వేసవి సెలవులు మంజూరు చేయాలన్నారు. 42 రోజుల సమ్మె సందర్భంగా హామీ ఇచ్చిన మినిట్స్ కాపీ అమలు చేయాలన్నారు. హెల్పర్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. అందరికీ ప్రమోషన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నగర అధ్యక్షుడు చంద్రారెడ్డి, ఉదయ్, వినీల, కోటేశ్వరి, లక్ష్మి, సావిత్రి, వసుంధర, శైలజ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద అంగన్వాడీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ధర్నా

‘తెల్ల’బోతోంది..!

- రోజురోజుకూ తగ్గుతున్న పత్తి ధరలు
- సాగు ఖర్చులు కూడా రావని రైతుల ఆవేదన



వేంపల్లె మండలంలో పత్తిని కోస్తున్న రైతులు (ఫైల్‌ఫొటో)



ఇంట్లో నిల్వ చేసిన పత్తి

వేంపల్లె, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించి పండించిన పంటకు గిట్టుబాటు ధర దొరకడం లేదు. పెట్టిన పెట్టుబడి అయినా చేతికొస్తుందో లేదో అనే భయంతో పంటలను సాగుచేస్తున్నారు. అరకొర దిగుబడి రావడం, అంతంతమాత్రమే ధరలు ఉండడంతో రైతు నష్టపోతున్నాడు. నిన్న మొన్నటి వరకు పత్తికి మోస్తరు ధర ఉన్నా ఇప్పుడు క్రమంగా తగ్గిపోతోంది. నెలన్నరక్రితం క్వింటా రూ.8000 పలికిన పత్తి ప్రస్తుతం రూ.5800 నుంచి రూ.6000కు దిగడంతో పత్తి రైతులు ఆందోళన చెందుతున్నారు.

పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు

జిల్లాలో పత్తిని రైతులు విస్తారంగా సాగుచేస్తున్నారు. ముఖ్యంగా పులివెందుల, కమలాపురం, జమ్మలమడుగు నియోజకవర్గాల్లో పత్తి విస్తారంగా సాగవుతుంది. ప్రొద్దుటూరు నియోజకవర్గంలోనూ కొంతమేర సాగు చేస్తారు. ఇందులో భాగంగా వేంపల్లె మండలంతో పాటు కత్తలూరు, వెలమవారిపల్లె, పాములూరు, అయ్యవారిపల్లె, రామిరెడ్డిపల్లె తదితర గ్రామాల్లో దాదాపు 300 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. ఎకరా పత్తి సాగుచేసేందుకు సేద్యం, విత్తనం, మందులు, సతవలు, కూలీలు, ఇతర ఖర్చులు కలిపి రూ.35వేల నుంచి రూ.40వేలు ఖర్చు అవుతోంది. ప్రస్తుతం ఎకరాకు దిగుబడి ఎనిమిది నుంచి పది క్వింటాళ్లు మాత్రమే వస్తోంది. ఇప్పుడున్న ధరతో ఎకరాకు రూ.50వేలకు మించి రావడం లేదు. ఈ సీజన్‌లో అత్యధికంగా నెలన్నర క్రితం రూ.8400 వరకు క్వింటా ధరపలికింది. రోజులు గడిచే కొద్దీ ధర తగ్గుతోంది. ఇక్కడి నుంచి ప్రొద్దుటూరు, బళ్లారి, గుంటూరు తదితర ప్రాంతాలకు పత్తిని ఎగుమతి చేస్తుంటారు. ధర ఎందుకు తగ్గుతోందో చెప్పలేని పరిస్థితి. ధరకోసం పత్తిని బస్తాల్లో వేసి ఇళ్లలో నిల్వ ఉంచుకుంటున్నారు. ధర ఇంకా తగ్గుతుందా లేక పెరుగుతుందా అన్న సందిగ్ధంలో ఉన్నారు. కొందరు రైతులు ఆశగా ధర పెరుగుతుందేమోనని ఎదురుచూస్తున్నారు. క్వింటా కనీసం రూ.8వేలు పలికితే రైతులు నష్టపోకుండా ఉంటారు. జూన్, జులైలో సాగుచేసిన రైతులు ప్రస్తుతం పత్తిని కోస్తున్నారు. పత్తికి గిట్టుబాటు ధర వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

వేడుకగా.. పెద్దదర్గా ఉరుసు

- చాదర్ సమర్పించిన కలెక్టర్



పెద్దదర్గాకు చాదర్ తీసుకొస్తున్న కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్

కడప కల్చరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ పర్యాటక ప్రాంతం, ప్రముఖ సూఫీ క్షేత్రమైన కడప అమీన్‌పీర్ దర్గా ప్రధాన ఉరుసు ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజైన ఆదివారం దర్గా పీఠాధిపతి హజ్రత్ సయ్యద్‌షా ఆరిఫుల్లా హుసేనీ సాహెబ్ దర్గాలో గురువుల మజార్లపై గంధం సమర్పించారు. తొలుత దర్గా ముషాయిరా హాలులో వార్షిక నివేదిక సమర్పించారు. రాత్రి ఆషారే షరీఫ్‌లో భాగంగా దర్గాలోని గురువుల స్మారక వస్తువుల దర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రి ఫకీర్ల విన్యాసాలు, బ్యాండు మేళాల మధ్య పీఠాధిపతి గంధం కలశాన్ని తమ ఇంటి నుంచి ఊరేగింపుగా దర్గాకు తీసుకువచ్చారు. అనంతరం ప్రార్థనలు చేసి పవిత్ర గ్రంథాన్ని దర్గా గురువుల మజార్ వద్ద సమర్పించారు. విశేష ప్రార్థనలు నిర్వహించి భక్తులందరికీ పాతెహా ప్రసాదాన్ని పంచిపెట్టారు. అలాగే ఉత్సవాల్లో భాగంగా కడప నగరం పెద్దబజారుకు చెందిన వస్త్ర వ్యాపారులు పూలచాందినితో పాటు వారి పక్షాన గంధాన్ని దర్గాకు చేర్చి చదివింపులు చేశారు. అనంతరం దేశంలోని ప్రముఖ గాయకులు తమ ఖవ్వాలీ గానంతో భక్తులను ఉర్రూతలూగించారు. వారు దర్గా గురువుల మహిమలు, పవిత్రత తదితర అంశాల గురించి గానం చేశారు. కాగా.. కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్, ఇన్‌చార్జి ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు సంప్రదాయంగా చాదర్‌ను సమర్పించారు. ఉత్సవాలలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు ఎస్.గోవర్ధనరెడ్డి, బి.హరిప్రసాద్, నేతలు జిలానీబాషా, సలావుద్దీన్, కడప ఆర్డీవో జాన్ ఇర్విన్ తదితరులు పాల్గొన్నారు.

మెరిసిన దర్గా ప్రాంగణం

ఉరుసు ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం 6గంటల నుంచి దర్గా ప్రాంగణం భక్తజనంతో కిటకిటలాడింది. దర్గాలో ప్రార్థనలు చేసుకునేందుకు వచ్చిన భక్తులతో పాటు బయటి ప్రాంతాల నుంచి భక్తుల సందడి పెద్దగా కనిపించింది. దర్గా చుట్టుపక్కల హిందువుల దేవాలయాల వద్ద కూడా నిర్వాహకులు విద్యుత్‌దీపాలంకరణ చేయడం గమనార్హం. పోలీసులు, జిల్లా అధికారులు పటిష్ఠమైన చర్యలు చేపట్టడంతో ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదు.



పెద్దదర్గా వద్ద భక్తుల సందడి

అందరి సహకారంతో అభివృద్ధికి కృషి

- ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పార్టీలకతీతంగా అందరి సహకారంతో కడప నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తానని ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి పేర్కొన్నారు. ఆదివారం ఆమె తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు తనపై ఎంతో నమ్మకంతో ప్రభుత్వ విప్ పదవి ఇచ్చారని, ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తానన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా కడప నగరంలో సమస్యలు కొల్లలుగా ఉన్నాయన్నారు. ప్రధానంగా తాగునీటి సమస్య ఉందన్నారు. నియోజకవర్గంలో ఇంతవరకు 20 శాతం గృహాలకు నీటి కనెక్షన్లు లేవన్నారు. చిన్న వర్షం పడితే కడప నగరంలో పలు ప్రాంతాలు జలమయం అవుతాయన్నారు. 2005లో కార్పొరేషన్ ఏర్పడిందని అప్పటి నుంచి కార్పొరేషన్ కాంగ్రెస్, వైసీపీ ఆధీనంలో మగ్గిపోయిందని తెలిపారు. ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఫండ్స్ ఎలా సేకరించుకోవాలో అందరి సలహాలు, సూచనలు తీసుకుంటామన్నారు. ఈ ఐదేళ్ల కాలంలో కడప నగరంలో ఉన్న ప్రతి సమస్య పరిష్కరిస్తామన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రతిపక్ష ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రాకుండా విమర్శలు చేయడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు గడవకముందే ప్రతిపక్ష పార్టీలు విమర్శలు చేస్తున్నాయన్నారు. అసెంబ్లీకి రాకుండా బయట ప్రశ్నించేందుకా మిమ్మలని శాసనసభ్యులుగా ప్రజలు ఎన్నుకున్నారు అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఎమ్మెల్యేలు రాజీనామా చేస్తే ఉప ఎన్నికలు వస్తాయని.. ఆ స్థానంలో వేరే వారు ఎంపిక అయితే వారు అసెంబ్లీకి వచ్చి సమస్యలపై మాట్లాడే అవకాశం ఉంటుందన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆర్.మాధవి, చిత్రంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి

కడప బస్టాండులోకి వెళ్లడానికి ఉన్న రెండు దారుల్లో ఇలా కాలువ పనులు జరుగుతున్నాయి







మరొక దారిలో నడవడానికి కూడా వీలులేకుండా నిలిచిన మురుగునీరు

ముందు బురద.. వెనక మురుగు..!

అది ఘనత వహించిన జిల్లా కేంద్రమైన కడప ఆర్టీసీ బస్టాండు. రాత్రి, పగలూ తేడా లేకుండా నిత్యం వందలాది బస్సులు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న డిపోల నుంచే కాకుండా తెలంగాణ, కర్ణాటక నుంచి కడప డిపో మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులతో కడప బస్టాండ్ సందడిగా ఉంటుంది. అలాంటి బస్టాండులోకి వెళ్లాలన్నా.. లోపల నుంచి బయటకు రావాలన్నా మురుగునీటిలో నడవాల్సిన దుస్థితి వచ్చింది. దీంతో తప్పనిసరైన వారు తప్ప ఇతరులు కడప ఆర్టీసీ బస్టాండుకు రావడం మానుకుంటున్నారు.

- బస్సు దిగాలన్నా.. ఎక్కాలన్నా
- మురుగు.. లేదా బురదలో కాలేయాల్సిందే
- డ్రైనేజీ కాల్వ మరమ్మతులతో గోతులు
- బయటకు పోయే దారిలేక నిలిచిన వర్షపునీరు
- తీవ్ర ఇబ్బందుల్లో ప్రయాణికులు
- ఇదీ కడప ఆర్టీసీ బస్టాండ్ దుస్థితి

కడప మారుతీనగర్ నవంబర్ 17, (ఆంధ్రజ్యోతి): మామూలుగా కడప ఆర్టీసీ బస్టాండ్‌లోకి ముందు వైపున గల ఇన్ గేట్ ద్వారా బస్సులు వస్తుంటాయి. అలాగే ప్రయాణికులతో బయటకు వచ్చే బస్సులు బస్టాండ్ వెనుక వైపున గల ఔట్ గేట్ ద్వారా పోతుంటాయి. కాగా.. బస్టాండ్ ముందు వైపున గల ప్రధాన డ్రైనేజీ నిర్మాణం పనులు కొన్ని రోజులుగా సాగుతున్నాయి. దీంతో ఇన్ గేట్ నుంచి బస్సులు లోనికి వచ్చే మార్గం లేదు. దీంతో బస్టాండులోకి బస్సుల రాకపోకలు ఒకేదారి (ఔట్ గేట్) నుంచి సాగుతున్నాయి. అక్కడా మోకాటిలోతు వర్షపునీరు నిలిచి బురదబురదగా మారింది.


ఇన్ గేట్‌కు తూర్పు దిశగా బస్టాండులోకి వెళ్లే మరో దారిలోనూ వర్షపు నీరు చేరింది. ఇందులోనే మురుగునీరు కలుస్తోంది. ఆ దారి గుండా బస్టాండ్‌లోకి వెళ్లాలంటే సర్కస్ ఫీట్లు చేయక తప్పడం లేదు. ఇటీవల ద్విచక్ర వాహనంలో బస్టాండులోకి వెళ్తున్న ఇద్దరు అయ్యప్ప భక్తులు వాహనం నుంచి బురదనీటిలో పడిపోయారు. స్కూటీపై ఓ వృద్ధురాలిని మనుమరాలు బస్టాండుకు తీసుకొస్తున్న క్రమంలో స్కిడ్ అయ్యి నీటిలో పడ్డారు. ఇక బస్టాండ్ వెనుక గల ఔట్ గేట్ ప్రాంతం చిన్నపాటి మురుగునీటి కుంటలాగా తయారైంది. వర్షపు నీరు బయటకు పోయే మార్గం లేకపోవడంతో.. ఆ నీటిలోనే ప్రయాణికులతో బస్సులు బయటకు వస్తున్నాయి. దీంతో ప్రయాణికులు బస్టాండుకు చేరుకోవాలంటే నరకయాతన అనుభవిస్తున్నారు. యువకులైతే ఎలాగోలా బస్టాండ్‌కు చేరుకోగలరు. కానీ పిల్లలు, వృద్ధులు, మహిళలు దివ్యాంగుల పరిస్థితి ఇబ్బందికరంగా ఉంది. ఒక్కో ప్రయాణికుడు కొనుగోలు చేసే బస్సు టికెట్ ద్వారా సెస్ రూపంలో కొంతమొత్తం బస్టాండుకు చేరుతుంది. అలాంటి ప్రయాణికుడు ఇవాళ బస్టాండుకు చేరుకోలేక అవస్థలు పడుతున్నా డిపో అధికారులు మాకెందుకన్నట్లుగా చోద్యం చూస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు బస్టాండులో కనీసం బస్సులు నిలిచే చోటయినా నీళ్ల నిల్వ ఉండకుండా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వర్షపు నీటిని తొలగిస్తాం..

ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా కడప డిపో ముందు, వెనుక భాగాలలో వర్షపు నీరు నిలిచింది. ఆ నీటిని సోమవారం తొలగించేస్తాం. బస్టాండ్ ఇన్ గేట్ ప్రాంతంలో డ్రైనేజీ కాల్వ పనులు సాగుతున్నాయి. అవి పూర్తి అయ్యేవరకూ కొంత ఇబ్బందికరంగా ఉంటుంది. ప్రయాణికులు సహకరించాలి.

\- ఢిల్లీశ్వర్‌రావు, ఆర్టీసీ కడప డిపో మేనేజర్

బస్టాండ్‌ను నాశనం చేశారు..



ప్రయాణికులే ఆర్టీసీకి దేవుళ్లు అనే మాటకు కడప డిపో ఆర్టీసీ అధికారులు మంగళం పలికారు. ప్రభుత్వం నెలకు జీతాలిస్తుంది. ప్రయాణికుల గురించి మాకెందుకన్నట్లుగా వారి తీరుంది. కడప బస్టాండ్‌ను నాశనం చేశారు. బస్టాండు కాదు.. అది మురుగునీటి కుంటగా మారిపోయింది.

\- సి. ఓబులేసు, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు

మురుగుకుంటలా బస్టాండు..



మురుగునీటి కుంటను తలపించేలా కడప ఆర్టీసీ బస్టాండ్ ఉంది. అంతలా మారడానికి కారకులు డిపో అధికారులే. ప్రయాణికుల నుంచి టికెట్ల రూపంలో డబ్బులు తీసుకోవడంలో ఉండే శ్రద్ధ.. బస్టాండుకు వచ్చే వారికి కావలసిన సౌకర్యాల కల్పనలో మాత్రం లేదు. కడప బస్టాండుకు చేరుకోవాలంటే మురుగు నీటిలో రావాల్సిందే.

\- నిత్యపూజయ్య, టీడీపీ యువ నేత



బస్టాండులోకి ప్రస్తుతం రాకపోకలు సాగించే ఒకేఒకదారీ ఇలా ఉంది



వెల్లివిరిసిన మత సామరస్యం

● అయ్యప్ప మాలధారులకు ముస్లింల అన్నదానం



అయ్యప్ప భక్తులకు అన్నదానం చేస్తున్న సంస్థ సభ్యులు

మదనపల్లెఅర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో మతసామరస్యం వెల్లివిరిసేలా హెల్పింగ్ మైండ్స్ నిర్వాహకులు అబూబకర్ సిద్ధిక్, తన సభ్యులతో కలిసి ఆదివారం అయ్యప్ప మాలధారులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్లుగా మతసామరస్యంతో సోదర భావాన్ని పెంపొందిస్తూ పవిత్ర అయ్యప్పస్వామి మాలధారులకు స్థానిక జ్ఞానోదయ పాఠశాలలో భిక్షను నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మొదటగా అయ్యప్ప చిత్రపటానికి పూజ నిర్వహించి, హారతి ఇచ్చిన అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో హెల్పింగ్ మైండ్స్ సభ్యులు కిరణ్, ఆబిద్, మొఖద్దర్, ముఫీ, హనీఫ్, సమీర్, పవన్, సాయిదీపక్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

కలకలం రేపిన కొండచిలువ



ప్రజలు కొట్టిచంపిన కొండచిలువ

కాశినాయన, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన నర్సాపురం తహసీల్దారు కార్యాలయం ముందు ప్రధాన రహదారిపై శనివారం రాత్రి కొండచిలువ కనిపించడంతో ప్రజలు బెంబేలెత్తిపోయారు. నిత్యం రాత్రి పది గంటల వరకు ప్రజలు రాకపోకలు సాగించే ఈ రోడ్డులో కొండ చిలువ దర్శనమివ్వడం కలకలం రేపింది. తహసీల్దారు కార్యాలయ పరసరాల నుంచి సమీపంలోని ముళ్ల కంపలోకి రోడ్డుదాటుకొని వెళ్లే సమయంలో ప్రజల కంటపడింది. గమనించిన పాదచారులు చుట్టుపక్కల వారికి తెలియజేయడంతో అందరూ కలిసి కర్రలతో కొట్టిచంపారు. దాదాపు రెండు మీటర్లకు పైగా పొడవు ఉన్న ఈ కొండచిలువ తక్కువ వయస్సు కల్గి ఉందని, ఎక్కడి నుంచి వచ్చిందో అంతుబట్టడం లేదని స్థానికులు అంటున్నారు.

గత పాలకుల నిర్ణయం డీసీఎంఎస్‌కు శాపం

● ఐదేళ్లలో రూ.6 కోట్ల నష్టం
● అందని కమీషన్లు
● అయోమయంలో అధికార యంత్రాంగం



కడప ఎన్టీఆర్‌సర్కిల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) నష్టాల్లో కూరుకుపోతోంది. రైతులకు అవసరమైన విత్తనాలు, పురుగుమందులు, ఎరువులు సర్కారు చేసే బాధ్యతను కొన్ని దశాబ్దాల కాలంగా చేపడుతూ వచ్చేది. అయితే గత ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేయడంతో అప్పటి నుంచి రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంది. ఉన్న వ్యాపారం చేజారిపోవడంతో డీసీఎంఎస్ మనుగడ కోల్పోయే పరిస్థితి నెలకొంది. అప్పుడప్పుడూ ఇతర వ్యాపారాలు చేస్తున్నప్పటికీ ప్రైవేటు వ్యాపారుల ముందు పోటీకి తట్టుకోలేక వ్యాపారాలు చేయలేక దిక్కులు చూడడం డీసీఎంఎస్ అధికారుల వంతైంది. ఈ క్రమంలో గతంలో చేసిన వ్యాపారాల ద్వారా ఆశించిన లాభాలను బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేసే వాటిపై వచ్చే వడ్డీలతో, గదులు, స్థలాలపై వచ్చే అద్దెలతో సిబ్బంది జీతాలు పొందుతున్న పరిస్థితి నెలకొంది.

ఐదేళ్లలో రూ.6 కోట్లు నష్టం

వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్లలో డీసీఎంఎస్ సుమారు రూ.6 కోట్లు నష్టాన్ని చవి చూడాల్సి వచ్చిందని సమాచారం. ప్రతి ఏడాది ఖరీఫ్, రబీ సీజన్‌లో ప్రభుత్వాలు ఇచ్చే రాయితీలు విత్తనాలు, ఎరువులు రైతులకు విక్రయించడం ద్వారా ఏడాదికి దాదాపు కోటి రూపాయలు ఆదాయం సమకూరేది. వీటి విక్రయాల బాధ్యత పూర్తిస్థాయిలో రైతు భరోసా కేంద్రాలకు అప్పగించడంతో గడిచిన ఐదేళ్ల కాలంలో సుమారు ఐదారు కోట్ల రూపాయల వ్యాపారం కోల్పోయింది. గతంలో లాగా విత్తనాలు ఎరువుల విక్రయాలు ఉంటే సంస్థలోని సిబ్బందికి డీసీఎంఎస్ రైతు వినిమయ కేంద్రాల్లో పని దొరికేది. ఆ వ్యాపారం లేకపోవడంతో సిబ్బందికి కూడా తగినంత పనిలేకుండా పోయే పరిస్థితి ఏర్పడింది. ఈ అంశంపై గతంలో ఉన్న పాలకవర్గాలు కూడా ప్రభుత్వంపై వత్తిడి తీసుకురాలేకపోవడంతో డీసీఎంఎస్‌లకు నష్టాలు తప్ప లేదు. సహకారరంగం ఏర్పడిందే రైతులకు సేవలు అందించేందుకు అని చెబుతుంటారు. కానీ ప్రభుత్వ పాలసీ ఇందుకు విరుద్ధంగా అమలైనా అడిగే వారు లేకపోవడంతో ప్రభుత్వ నిర్ణయం డీసీఎంఎస్‌కు శాపంగా మారింది. ఇది వరకు కొనసాగిన పాలకవర్గాలు కూడా ఇతర వ్యాపారాలు, సరఫరా పనులకు కాంట్రాక్టు తేవడంలో కూడా సరైన చొరవ చూపెట్టక పోవడంతో సంస్థ నష్టాల బాటలో నడుస్తుందనే చర్చ సాగుతోంది.



రైతుభరోసా కేంద్రం

అందని కమీషన్లు

చేసిన పనికి సకాలంలో కమీషన్లు అందకపోవడంతో డీసీఎంఎస్ పరిస్థితి మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా తయారైంది. విత్తనాలు, ఎరువులు ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా పంపిణీ చేపట్టడంతో నష్టపోతున్న డీసీఎంఎస్‌కు రైతు ఉత్పత్తులను సేకరించడం ఒక ఆదాయ వనరుగా ఏర్పడింది. ఈ క్రమంలో ప్రతి సంవత్సరం ఏపీ మార్క్‌ఫెడ్, పౌరసరఫరాల సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుని సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేసేవారు. ఈ క్రమంలో డీసీఎంఎస్ చేసిన పనికి కొంతమేర కమీషన్ ఇచ్చేవారు. ఈ తరుణంలో ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా దాదాపు రూ.రెండున్నర కోట్ల వరకు డీసీఎంఎస్‌కు రావాల్సి ఉందనేది సమాచారం. అదే విధంగా పౌరసరఫరాల సంస్థ నుంచి దాదాపు రూ.70 లక్షలు అందాలని తెలుస్తోంది. వీటికి సంబంధించిన బకాయిలు వసూలైతే కొంత మేర ఊరట కలిగే అవకాశం ఉంది. నిధులు లేకపోవడంతో సిబ్బందికి తగినన్ని విధులు లేనట్లు తెలుస్తోంది. ఒక పక్క ప్రభుత్వానికి సంబంధించిన విద్య ఇన్‌స్టిట్యూట్లకు అవసరమైన సామగ్రిని సరఫరా చేసేందుకు కాంట్రాక్టు కోసం ప్రయత్నిస్తూ ఉన్నప్పటికీ అందిన పరిస్థితి లేదు. ఐసీడీఎస్‌కు, కస్తూర్బా స్కూళ్లకు అవసరమైన నిత్యావసర వస్తువులు, ప్రభుత్వ కార్యాలయాలకు అవసరమైన స్టేషనరీని సరఫరా అవకాశం ఉన్నప్పటికీ అందుకు తగిన అవకాశాలు దక్కకపోవడంతో డీసీఎంఎస్ అధికార యంత్రాంగం అయోమయంలో ఉంటుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఐఏఎస్ అధికారులకు ప్రత్యేక అధికారి బాధ్యతలు ఇచ్చారు. అంతేకాకుండా దిశ నిర్దేశం చేసేందుకు సహకార శాఖ నుంచి ఒక సీనియర్ అధికారికి డీసీఎంఎస్ పనితీరుపై పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. ఇప్పటికైనా ప్రత్యేక అధికారి చొరవతో వివిధ శాఖలకు సంబంధించిన వస్తువుల సరఫరా బాధ్యతలు డీసీఎంఎస్‌కు అందుతాయని అధికారులు, సిబ్బంది ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

కమీషన్ల వసూళ్లకు ప్రయత్నిస్తున్నాం

- ఖాదర్‌వల్లి, ఇన్‌చార్జ్ బిజినెస్ మేనేజరు, డీసీఎంఎస్

ఏపీ మార్క్‌ఫెడ్ సివిల్ సప్లై నుంచి దాదాపు రూ.మూడు కోట్లు కమీషన్లు రావాల్సి ఉంది. వాటి వసూళ్ల కోసం రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో మాట్లాడుతున్నాం. ప్రభుత్వ శాఖలకు అవసరమైన స్టేషనరీ, సామగ్రి సరఫరా పనులు దక్కితే మరింత బాగుంటుంది.

గొలుసు దొంగల అరెస్టు

● రూ. 30 లక్షల నగలు, మోటార్‌సైకిళ్ల స్వాధీనం



చైన్‌స్నాచర్లను చూపుతున్న ఎస్పీ మణికంఠ తదితరులు

పలమనేరు, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): కొంతకాలంగా ఒంటరి మహిళలకు కునుకు లేకుండా చేస్తున్న చైన్ స్నాచర్లను పోలీసులు అరెస్టు చేశారు.ఇటీవల గొలుసు దొంగతనాలు బాగా పెరిగిన విషయం తెలిసిందే. మహిళలకు బయటికెళ్లాలంటే భయపడే పరిస్థితి నెలకొంది.ఈ నేపథ్యంలో 8మంది చైన్ స్నాచర్లను అరెస్టు చేసి రూ. 30 లక్షలకు పైగా విలువ చేసే బంగారు నగలు, మోటరు సైకిళ్ల స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ మణికంఠ తెలిపారు.పలమనేరు డీఎస్పీ కార్యాలయంలో ఆదివారం ఎస్పీ మణికంఠ వివరాలను వెల్లడించారు. పుంగనూరులో ఈనెల 1వతేది ఓ మహిళ మెడలో గొలుసు లాక్కెళ్లారు.పుంగనూరు ఆర్టీసీ డిపోలో పనిచేసే అవుట్ సోర్సింగ్ ఉద్యోగి బుక్యాప్రసాద్‌నాయక్ ఈనెల 15వతేది పుంగనూరు మినీ బైపాస్ రోడ్డుపై వెళ్తున్న ఓ మహిళ మెడలోనుంచి చైన్ లాక్కెళ్తుండగా స్థానికులతో కలిసి పుంగనూరు సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ లోకేష్ వెంబడించారు. అతడిని అరెస్టు చేసి రూ.6.50 లక్షల విలువైన 69 గ్రాముల మూడు బంగారు చైన్లు, ఒక మోటరు సైకిల్ స్వాధీనం చేసుకున్నారు.లోన్ యాప్‌లో రుణాలు తీసుకొని చెల్లించలేక ఈ నేరానికి పాల్పడినట్లు విచారణలో తేలింది. కొద్ది రోజులుగా చౌడేపల్లి, గంగవరం, కురబలకోట, రామసముద్రం, పలమనేరు, శాంతిపురం, బైరెడ్డిపల్లి మండలాల్లో ఒంటరిగా వెళుతున్న మహిళల మెడలో బంగారు గొలుసులను లాక్కెళ్లిన ఏడుగురిని అరెస్టు చేసి చైన్లను స్వాధీనం చేసుకున్నారు. అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లి మండలం ఏటిగడ్డపల్లికి చెందిన ముద్దం చంద్రశేఖర్(32), హరికృష్ణ(24), మదనపల్లెకు చెందిన దాసరి నాగరాజు అలియాస్ నాగ (38), ఎల్.భాస్కర్(37),కె. పవన్‌కుమార్(27) బి.కొత్తకోటకు చెందిన పి.బావాజాన్ (35), చౌడేపల్లి మండలం మదుకూరుకు చెందిన గుంతలపేట లక్ష్మీపతి అలియాస్ చంటి(30) అరెస్టు అయిన వారిలో వున్నారు. వీరి వద్ద చోరీ చేసిన 332 గ్రాములు బంగారు ఆభరణాలు, దొంగతనాలకు ఉపయోగించిన మూడు మోటరు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ మణికంఠ తెలిపారు. డీఎస్పీ డేగల ప్రభాకర్ ఆధ్వర్యంలో చైన్‌స్నాచర్స్‌ను అరెస్టు చేయడంలో కీలక పాత్ర పోషించిన ఏఎస్‌ఐ శ్రీనివాసులు నాయుడు, కానిస్టేబుళ్లు అల్లావుద్దీన్, శశిధర్, బాలాజి, రెడ్డెప్ప, వెంకటరమణ, ఎల్లప్పలకు రివార్డులను ఎస్పీ అందజేశారు.అలాగే గొలుసులను పోగొట్టుకున్న బైరెడ్డిపల్లి మండలం రామసముద్రం గ్రామానికి చెందిన అలివేలుతో పాటు మరో ఇద్దరు మహిళలకు బంగారు చైన్లను ఎస్పీ మణికంఠ అందజేశారు.

శ్మశాన స్థలం కబ్జా

● తెల్లవారుజామున ప్రహరీ కూల్చివేత
● పోలీసులకు సర్పంచ్ ఫిర్యాదు



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దారు, ఎస్‌ఐ

పుల్లంపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పుల్లంపేటలో కబ్జారాయుళ్లు రెచ్చిపోతున్నారు. పోలీసులకు ముందస్తు సమాచారం ఉన్నా అర్ధరాత్రి రెండు గంటల వరకు కాపుగాసిన కూడా కబ్జారాయుళ్లు బెదరలేదు. పుల్లంపేట పోలీసుస్టేషనుకు అతి దగ్గరలో ఉన్న పుల్లంపేట శ్మశానానికి నిర్మించిన కాంపౌండ్‌వాల్ కూల్చి పోలీసులకు సవాల్ విసిరారు. పుల్లంపేట టౌన్‌లో తహసీల్దారు కార్యాలయానికి ఆనుకుని ఉన్న సర్వేనంబరు 280లో 6.20లో తోపు పొరంబోకు భూమి ఉంది. ఏడాది క్రితం రూ.5 లక్షల జడ్పీ నిధులతో కొంతమేర కాంపౌండ్‌వాల్‌ను నిర్మించారు. శ్మశానానికి నిర్మించిన కాంపౌండ్‌వాల్‌ను కూల్చివేసి ఆక్రమణ చేస్తున్నారని పోలీసులతో పాటు అధికారులకు ముందుస్తు సమాచారం ఉండడంతో స్థానిక ఎస్‌ఐ మోహన్‌కుమార్‌గౌడ్ అర్ధరాత్రి రెండు గంటల వరకు పోలీసులతో గస్తీ తిరిగారు. ఆ తర్వాత పోలీసులు లేని సమయం చూసి కబ్జారాయుళ్లు ఎక్సకవేటర్ సాయంతో కూలదోసి చదును చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దారు అరవిందకిషోర్, ఎస్‌ఐ మోహన్‌కుమార్‌గౌడ్‌లు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కూల్చివేసిన వారి కోసం ఆరా తీశారు. శ్మశానంలో ఆక్రమణ కోసం కాంపౌండ్‌వాల్‌ను కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులరెడ్డి, ఇన్‌చార్జి ముత్తయ్య పోలీసులను కోరారు.

విద్యాశాఖ వింత నిర్ణయాలకు స్వస్తి పలకాలి

● యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు

రాయచోటిటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ అనాలోచిత నిర్ణయాలు, తొందరపాటు కార్యక్రమాలకు స్వస్తి పలకాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, జాబీర్ వ్యాఖ్యానించారు. ఆదివారం పట్టణంలో జరిగిన యూటీఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ కొంత కాలంగా విద్యాశాఖలో జరుగుతున్న విధానాలతో విద్యారంగం నిర్వీర్యం అవుతోందని ఆరోపించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల్లో తీవ్ర అలజడి, ఆందోళన నెలకొందన్నారు. ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరిపి ఆమోదం తెలిపినా తిరిగి ఏకపక్ష విధానాలను అమలు చేస్తున్నారన్నారు. శనివారం జరిగిన రాష్ట్ర స్థాయి సమావేశంలో నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణ తరగతులు ఉంటాయని చెప్పి, మళ్లీ నేడు ప్రధానోపాధ్యాయులకు ఆరు రోజులు రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణ నిర్వహిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేయడం సమంజసం కాదన్నారు. ఇప్పటికే పని సర్దుబాటు ప్రక్రియ ప్రాథమిక పాఠశాలలపై తీవ్ర ప్రభావం చూపుతోందని, అనేక పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మిగిలిపోయాయన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కోశాధికారి చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శులు సీవీ రమణమూర్తి, దావుద్దీన్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ సురేంద్రారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

గుర్రంకొండ ఏఎస్‌ఐపై కేసు నమోదు

● అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని భార్య ఫిర్యాదు

మదనపల్లె అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ ఏఎస్‌ఐ పి.మోసస్‌పై కేసు నమోదు చేసినట్లు మదనపల్లె టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపారు. ఆయన వివరాల మేరకు మదనపల్లె పట్టణం ఎస్బీఐ కాలనీలో కాపురం ఉంటున్న మోసస్‌కు 30 ఏళ్ల క్రితం కె.ఎస్తర్ రాణి(55)తో వివాహమైంది. అయితే తన భర్త అదనపు కట్నం కోసం తనను మానసికంగా హింసిస్తున్నాడని ఆమె మదనపల్లె టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఆమెకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

వృద్ధురాలిపై పంది దాడి



తీవ్రంగా గాయపడ్డ వృద్ధురాలు

చెన్నూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు శ్రీరామ్‌నగర్‌కు చెందిన బొర్రా నాగమ్మ (75) అనే వృద్ధురాలిపై పంది దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఇటీవల కాలంలో చెన్నూరు వ్యాప్తంగా పందుల సంచారం ఎక్కువైంది. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లిన వృద్ధురాలిని ఒక్కమారుగా పంది దాడి చేయడంతో కాళ్లకు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా మారడంతో ఆ వృద్ధురాలిని స్థానికంగా ఉన్న ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ ప్రాథమిక చికిత్స చేసి అనంతరం కడపకు తీసుకెళుతున్నట్లు బంధువులు తెలిపారు. కాగా పందుల సంచారంపై పలుమార్లు స్థానిక పంచాయతీలో ఫిర్యాదు చేయడం, కార్యదర్శి పోలీసు సిబ్బందితో వాటిని పట్టించినా స్థానికంగా ఉన్న కొందరు నేతలు పట్టుబడిన పందులను మేపేవారి కోరిక మేరకు మరలా వాటిని కొంత దూరం వెళ్లాక బయటికి వదిలేయడం జరుగుతుంది. దీంతో పందుల సంఖ్య పెరగడమే తప్ప తగ్గడం లేదు. ఈ విషయంపై తక్షణం చర్యలు తీసుకోవాలని పందుల సంచారం లేకుండా నిర్మూలించాలని అన్నారు.

భార్యాభర్తలపై దాడి

మదనపల్లెఅర్బన్, నవంబరు17(ఆంధ్రజ్యోతి): బసినికొండలో నీళ్ల ట్యాంకు నిర్మాణం పనులు చేస్తున్న భార్యభర్తలపై ప్రత్యర్థులు దాడి చేసి గాయపర్చినట్లు తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. ఆదివారం మదనపల్లె మండలం, బసినికొండ పాతూరులో ఉన్న మురళి(41), గాయత్రి(31), కుమార్తె కాలనీకి మంజూరైన నీళ్లట్యాంకు నిర్మాణం పనులు చేస్తుండగా కస్పాకు చెందిన ఆర్టీసీ శంకర, అతని కుమారులు కన్నా, చిన్నా, ఇతరులు పనులు అడ్డుకొని గొడవకు దిగారు. విచక్షణా రహితంగా దాడి చేసి గాయపర్చారు. బాధితులను స్థానికులు మదనపల్లె జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించి వైద్య చికిత్సలు అందించారు. దాడిపై తాలుకా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆసక్తికరంగా రాయలసీమ స్థాయి క్రీడాపోటీలు



వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

లింగాల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ స్థాయి బాలికల క్రీడా పోటీలు ఆసక్తికరంగా సాగుతున్నాయి. మండలంలోని ఇప్పట్ల గురుకుల కళాశాలలో 14వ తేదీ నుంచి ఈ పోటీలు జరుగుతున్నాయి. ఆదివారం కబడ్డీలో లక్కిరెడ్డిపల్లె ప్రథమస్థానం, ఆళ్లగడ్డ ద్వితీయస్థానం, త్రోబాల్‌లో వాల్మీకిపురం ప్రథమస్థానం, గురిగుంట ద్వితీయస్థానం, జావెలెన్ త్రోలో పులివెందుల ప్రథమస్థానం, గురగుంట ద్వితీయ స్థానంలో నిలిచాయి. జిల్లా ఇన్‌చార్జి ఉదయశ్రీ, కోఆర్డినేటర్ నాగవేణి, ప్రిన్సిపల్ సత్యవతమ్మలు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

మదనపల్లెఅర్బన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణ ఇందిరానగర్‌కు చెందిన ఓ మహిళ అదృశ్యమైనట్లు టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపారు. ఈ నెల 12న ఆర్యోగం బాగా లేదని ఆమె ఇంటినుంచి మదనపల్లె జిల్లా ప్రభుత్వాస్పత్రికి వెళ్లిందని, తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకి తెలియకపోవడంతో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



లభ్యమైన గణేశ్ మృతదేహం

వల్లూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రెండురోజుల క్రితం పుష్పగిరి పెన్నానదిలో గల్లంతైన రెడ్డిపల్లె గణేశ్ (27) మృతదేహం ఎట్టకేలకు లభ్యమైంది. ఫైర్ సిబ్బంది, స్థానిక గజ ఈతగాళ్ల సాయంతో శుక్ర, శని వారాల్లో నదిలో వెతికిన విషయం పాఠకులకు విదితమే. కాగా ఆదివారం సిద్దవటం మండలం లింగంపల్లె పెన్నానది ఒడ్డున మృతదేహం బయటపడినట్లు ఏఎస్‌ఐ ప్రసాద్ తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

భార్యను కత్తితో పొడిచిన కేసులో నిందితుడి అరెస్ట్

● 14 రోజుల రిమాండ్

కాశినాయన, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బాలరాజుపల్లె గ్రామంలో గత శుక్రవారం భార్య సుబ్బలక్ష్మమ్మను కత్తితో పొడిచిన కేసులో దాడికి పాల్పడిన భర్త బసిరెడ్డి రామిరెడ్డిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ హనుమంతు తెలిపారు. బాధితురాలు సుబ్బలక్ష్మమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రామిరెడ్డిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి ఆదివారం బద్వేల్ కోర్టులో హాజరుపరచగా జడ్జి 14 రోజుల రిమాండ్ విధించారన్నారు.

అసంపూర్తిగా అర్బన్ హెల్త్‌సెంటర్

సీకేదిన్నె, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఉచిత వైద్యం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఆస్పత్రి భవనాలు నిర్మించి వైద్య సిబ్బందిని నియమించింది. అయితే అందులో కొన్ని వైద్యశాలలు నిధుల కొరతతో నిలిచిపోయాయి. వాటి నిర్మాణాలు సగంలోనే ఆగిపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరకపోగా వైద్యం కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వివరాల్లోకి వెళ్లితే... చింతకొమ్మదిన్నె మండలం కడప కార్పొరేషన్‌లో విలీనమైన 16, 17, 18, 45వ డివిజన్‌లో ప్రజల అవసరాలు తీర్చేందుకు చింతకొమ్మదిన్నె పోలీసు స్టేషన్ ఆవరణంలో అర్బన్‌హెల్త్ సెంటర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పనులు చకచకా సాగి



పూర్తికాని అర్బన్ హెల్త్ సెంటర్ భవన నిర్మాణం

ల్యాబ్ వరకు నిర్మాణం పూర్తయింది. ఆస్పత్రి భవన నిర్మాణం పూర్తయి త్వరలోనే ఇక్కడ మెరుగైన వైద్యసేవలు అందిస్తారని ప్రజలు భావిస్తున్న తరుణంలో ఉన్నట్టుండి పనులు నిలిపేశారు.

దీంతో అర్బన్ హెల్త్‌సెంటర్ నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందో తెలియక ప్రజలు ఆందోళనకు గురయ్యారు. అర్బన్ హెల్త్‌సెంటర్ పూర్తయితే కార్పొరేషన్‌లోని 16, 17, 18, 45 డివిజన్లతో పాటు చింతకొమ్మదిన్నె మండలంలోని ఆజాద్‌నగర్ తదితర ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు స్పందించి నిధుల కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిర్మాణం పూర్తి చేసి పేదలకు ఉచిత వైద్య సేవలు అందించాలని ఆయా ప్రాంతాల ప్రజలు విన్నవిస్తున్నారు.

అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణం బిల్లులు రాక నిలిపేశాం

చింతకొమ్మదిన్నె పోలీసు స్టేషన్ ఆవరణంలో చేపట్టిన అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణానికి బిల్లులు అందలేదు. దీంతో పనులను ఆపేశాం. బిల్లులు చెల్లిస్తే తిరిగి పనులు ప్రారంభించి భవన నిర్మాణాన్ని పూర్తి చేస్తాం. - గుత్తిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, కాంట్రాక్టర్

భవన నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి



అర్బన్ హెల్త్‌సెంటర్ భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి ప్రజలకు వైద్యసేవలు అందించాలి. తద్వారా ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లలేని పేదలకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి. - రామమోహన్‌రెడ్డి, మానవ హక్కుల సంఘం నేత

చిత్రం చెప్పిన సమస్య

నేను ఎవరో మీకు తెలుసా..? రిమ్స్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న రోడ్డును.. ఏకంగా ఎనిమిది కాలనీలకు వెళ్లే దారిని నేను.. వరద కాలనీ, ఆచారి కాలనీ, బెస్తకాలనీ, జర్నలిస్ట్ కాలనీ, పోలీసు కాలనీ, జగనన్న కాలనీ, దండోర కాలనీ, తిలక్‌నగర్‌లకు ఎవరైనా నామీద నుంచి పోవాల్సిందే..

గత ప్రభుత్వంలో జగనన్న కాలనీ కోసం తరలించే కంకర, సిమెంటు, ఇసుక, ఇటుక, మట్టితో భారీ వాహనాలు వెళ్లడంతో నా ఒళ్లంతా గుల్లైపోయింది. అది వానదెబ్బకు మరింత ఎక్కువైంది. వైసీపీ వాళ్లు నన్ను వాడుకుని వదిలేసి పరాజయంపాలయ్యారు. కనీసం కూటమి ప్రభుత్వమైనా పట్టించుకోవాలి కదా మరి...!!

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కడప



వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

వల్లూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): దుగ్గాయపల్లెలో గ్రామ దేవత గంగమ్మ తల్లి, దత్తాత్రేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం రెండోరోజైన ఆదివారం ఘనంగా నిర్వహించారు.పూజల అనంతరం ఆయా విగ్రహాలను అలంకరించి గ్రామోత్సవానికి తరలించారు. సాయంత్రం మహాస్నపనం, హోమాలు నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వాహకుడు, ఆర్టీసీ మాజీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి, భక్తులు తెలిపారు.



గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

బాడీ బిల్డర్ ఎస్.కె బాషా మృతి బాధాకరం

కడప స్పోర్ట్స్, నవంబరు 17, (ఆంధ్రజ్యోతి): కడప నగరానికి చెందిన బాడీ బిల్డింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎస్.కె. బాషా ఈ నెల 12న అకాల మృతి చెందడం బాధాకరమని బాడీ బిల్డర్స్ అసోసియేషన ప్రతినిధులు పేర్కొన్నారు. ఆయన మృతి పట్ల బాడీ బిల్డర్స్ అసోసియేషన్ల ప్రతినిధులు ఆదివారం ఫ్రెండ్స్ జిమ్‌లో శ్రద్ధాంజలి ఘటించారు. రాష్ట్ర బాడీ బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నూనె నాగేష్, ప్రధానకార్యదర్శి యూనస్ బాషా మా ట్లాడుతూ ఎస్‌కే బాషా లేనిలోటు తీర్చలేనిదన్నారు. జనవికాస్ సేవాసమితి అధ్యక్షుడు తాహిర్, జిమ్‌ల ప్రతినిధులు న్యాయతుల్లా, అల్లాహబకాష్, ఫిరోజ్‌ఖాన్, ఇబ్రహీం పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ మాజీ జిల్లా కార్యదర్శి చంద్ర తెలిపారు. ఆదివారం కడప నగరం హోచిమన్ భవన్‌లో ఏఐఎస్ఎఫ్ జెండా ఆవిష్కరణ జరిగింది. ఆయన మాట్లాడుతూ ఎస్సీఎస్టీబీసీ, మైనార్టీ సంక్షేమ వసతిగృహాలలో సమస్యలు పరిష్కరించాలన్నారు.

నీటిలో గంబూషియా చేపలు విడుదల

పులివెందుల రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పులివెందుల అర్బన్ పరధిలోని రోటరీపురం బ్రిడ్జి వద్ద దోమల నివారణ కోసం గంబూషియా చేపలను వదిలినట్లు బాకరాపురం యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శాంతకుమార్ తెలిపారు. గంబూషియా చేపలు దోమల లార్వాను ఆహారంగా తీసుకుంటాయని ఆయన పేర్కొన్నారు.

ప్రతి ఖాతాదారుడు ఆధార్ సీడింగ్ చేయించుకోవాలి

- పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సుశీల్‌కుమార్

వల్లూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఖాతాదారుడు తన ఖాతాకు సంబంధించి ఎన్‌పీసీఐ లింకును, ఆధార్ సీడింగ్‌లను తప్పనిసరిగా చేయించుకోవాలని, అలా చేయించుకుంటేనే ప్రభుత్వ పథకాలు నేరుగా ఖాతాల్లోకి జమ అవుతాయని ప్రొద్దుటూరు సౌత్ సబ్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ సుశీల్‌కుమార్ అన్నారు. ఆదివారం వల్లూరులోని పోస్టాఫీసులో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి ఖాతాదారుడు బ్యాంకుకు సంబంధించి ఆధార్ సీడింగ్, ఎన్‌పీసీఐ లింకు ఉందో, లేదో తెలుసుకుని వెంటనే లింకు చేయించుకోవాలన్నారు. తక్షణం తమ బ్రాంచ్ పోస్టాఫీసును సంప్రదించాలన్నారు. తమ సిబ్బందిని కలిస్తే వెంటనే చేస్తారన్నారు. ఒకవేళ ఖాతా లేకపోతే తమ పోస్టాఫీసులో ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాం కులో ఖాతా తెరిస్తే ఎన్‌పీసీఐ, ఆధార్‌సీడింగ్ అప్పటికప్పుడు చేస్తారన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సుశీల్‌కుమార్

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

వేంపల్లె, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత చర్మ వ్యాధుల చికిత్స శిబిరానికి విశేష స్పందన లభించింది. డాక్టర్ ఉదయ్‌కిరణ్‌రాజ రోగులకు చికిత్స చేసి ఉచితంగా మందులు అందించారు. దాదాపు 130 మంది రోగులు వైద్యచికిత్సలు చేయించుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కుంచా సాయినాథ్, కోఆర్డినేటర్ వుల్లగూర గోవర్దన్, శివరావు, నరసింహులు, బాలయ్య, నాగసుధామణి, సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కడప నగరంలోని రవి థియేటర్ దగ్గర మెడ్‌కేర్ ఆస్పత్రిలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో రోగులకు వైద్యం చేస్తున్న డాక్టర్ మహబూబ్ వల్లి

యువకుడిపై దాడి

కడప క్రైం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కడప నగరం చిలకల బావి వద్ద ఓ యువకుడిపై కొంత మంది యువకులు దాడి చేశారు. చిలకలబావి ప్రాంతానికి చెందిన అరబత్తు అదే ఏరియాకు చెందిన రియాజ్‌లకు గత కొంతకాలంగా మనస్పర్థలు ఉండేవి. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి అరబత్తుపై రియాజ్ మరికొందరితో కలిసి దాడి చేసి గాయపరిచారు. గాయపడ్డ వ్యక్తిని చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నేడు ఆరాధన

పెండ్లిమర్రి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పెండ్లిమర్రి మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన జగద్గురు సిద్దగురుస్వామి ఆరాధన మహోత్సవాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అన్నదానం, సీనియర్ వృషభరాజములచే బండలాగుడు పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఎమ్మెల్యే చైతన్యరెడ్డి బండలాగుడు పోటీలను ప్రారంభిస్తారని వారు తెలిపారు.

'అక్రమాలను వెలికితీయండి'

కడప సెవెన్‌రోడ్స్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): భానవ టౌన్‌షిప్ అక్రమాలను వెలికితీసి సమగ్రమైన విచారణ జరిపించాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డిని కలిసి వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శి సిద్ది రామయ్య, ఆర్సీపీ సీకేదిన్నె మండల కార్యదర్శి ప్రసాద్, రైతు సంఘం నాయకులు ప్రతాప్‌రెడ్డి, మునిరెడ్డి పాల్గొన్నారు.

సమాజ సేవలో పాలుపంచుకోవాలి

కడప సెవెన్‌రోడ్స్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత విద్యార్థి సమాఖ్య మాజీ నాయకులు ఏ రంగంలో సమాజ సేవలో పాలుపంచుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి, ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకుడు గాలిచంద్ర పిలుపునిచ్చారు. ఆదివారం వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ పూర్వ నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశలో క్రియాశీలక పాత్ర పోషించి విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు. ఈ సమావేశంలో మాజీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గండి అంజన్నను దర్శించుకున్న డీఐజీ అమ్మిరెడ్డి



చక్రాయపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ గండి క్షేత్రంలోని వీరాంజనేయ స్వామిని డీఐజీ అమ్మిరెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ ఉప ప్రధాన అర్చకులు, ఆలయ సిబ్బంది మంగళవాయిద్యాలతో పూర్ణకుంభంతో ఆయనకు స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు. శాలువ, పూలమాల వేసి వేద ఆశీర్వచనం చేశారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇల్లు మంజూరుకు దరఖాస్తు చేసుకోండి

పులివెందుల టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇల్లు మంజూరు కోసం అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని గృహ నిర్మాణ సంస్థ డిప్యూటీ ఇంజనీరు రమణారెడ్డి తెలిపారు. హౌసింగ్ ఏఈ కార్యాలయంలో సోమవారం నుంచి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. తెల్ల రేషన్‌కార్డు, భార్యాభర్త, ఆధార్ కార్డులు, బ్యాంకు అకౌంటు బుక్, ఆదాయ సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలు అందజేయాలన్నారు. ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేటప్పుడు ఆధార్ లింకు అయిన ఫోన్ నెంబరుకు ఓటీపీ వస్తుంది, కావున దరఖాస్తుదారుడు ఆధార్ కార్డులో ఉన్న ఫోన్ నెంబరు సెల్‌ను తీసుకుపోవాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

'నిరూపిస్తే పదవికి రాజీనామా చేస్తా'

పులివెందుల రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): భూమి ఎక్కడ ఆక్రమించానో నిరూపిస్తే తన పదవికి రాజీనామా చేస్తానని పులివెందుల మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి మున్సిపల్ చైర్మన్ భూ ఆక్రమణలకు పాల్పడ్డారని ఆరోపించారన్నారు. తాను భూమి ఆక్రమించినట్లు నిరూపిస్తే తన పదవికి రాజీనామా చేయడంతో పాటు రాజకీయ సన్యాసం తీసుకుంటానన్నారు.

'సెలవు దినాల్లో టాలెంట్ టెస్ట్ నిర్వహించడం దుర్మార్గం'

కడప ఎడ్యుకేషన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొన్ని కార్పొరేట్ విద్యాసంస్థల్లో సెలవు దినాల్లో కూడా టాలెంట్ పరీక్షలు నిర్వహించడం దుర్మార్గమని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాహుల్, రవి అన్నారు. ఆదివారం ఓ ప్రైవేటు పాఠశాలలో జరుగుతున్న టాలెంట్ పరీక్షను వారు అడ్డుకున్నారు. విద్యార్థులను తరగతి గది నుంచి బయటికి పంపించారు. ఎక్కువ మార్కులు వస్తాయని, పిల్లలకు ప్రైజ్‌లు కూడా ఇస్తామని తల్లిదండ్రులను మోసం చేస్తున్నారన్నారు.

ఎయిమ్స్‌లో ఆలిండియా ర్యాంక్

పులివెందుల రూరల్, నవంబరు 17: ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్) ఫలితాల్లో పులివెందులకు చెందిన సాయి రాఘవి ఆలండియా 220వ ర్యాంక్ సాధించారు. సాయిరాఘవి హైదరాబాద్‌లోని ఉస్మానియా మెడికల్ కళాశాలలో మెడిసిన్ చదివారు. పీజీ చదివేందుకు ఎంట్రెన్స్ టెస్ట్ రాయగా ఆలిండియా 220వ ర్యాంకు సాధించారు. దీంతో తల్లిదండ్రులు చంద్రశేఖర్ రెడ్డి, సుగుణమ్మ సంతోషం వ్యక్తం చేశారు.



సాయి రాఘవి

మోహిత్‌కు 102 ర్యాంకు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఎర్రముక్కపల్లెకు చెందిన మోహిత్‌కు ఎయిమ్స్‌లో 102వ ర్యాంకు లభించింది. ఎయిమ్స్‌లో ర్యాంకు రావడం పట్ల మోహిత్ తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.



మోహిత్

విష్ణు, లలితా సహస్ర నామ స్తోత్ర పారాయణం పుణ్యప్రదం

చెన్నూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): విష్ణు లలితా సహస్ర నామ స్తోత్ర పారాయణం పుణ్యప్రదమని ఎల్ఐసీ రిటైర్డ్ డెవలప్‌మెంటు అధికారి అమరేశ్వరరావు అన్నారు. స్థానిక మల్లేశ్వర ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా ఆదివారం కడప బ్రాహ్మణ సంఘం వారిచే విష్ణు లలితా సహస్ర నామ స్తోత్ర పారాయణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకల చరాచర సృష్టికి మూలం పరమాత్మ స్వరూపమేనని, అలాంటి పరమాత్మను మనసా వాచా కర్మనా త్రికరణ శుద్ధిగా పూజించాలన్నారు. అందులో భాగంగా మహావిష్ణువు, లలితాదేవి, పరమశివుడిని ఇలా వారి వారి అభీష్టాలకనుగునంగా పారాయణం చేస్తే మంచిదన్నారు. ప్రతి వ్యక్తి తన కుటుంబ సభ్యులతో కలిసి వారంలో ఒక రోజైనా ఆలయానికి వెళ్లడం, తమ ఇంట్లో భగవన్నామ స్మరణ, సహస్ర నామ స్తోత్రాలు పారాయణం చేయడం పుణ్యప్రదమన్నారు. ముఖ్యంగా పరమపవిత్రమైన కార్తీక మాసం శివకేశవులకు ఎంతో ఇష్టమని, అలాంటి మాసంలో విష్ణు సహస్ర నామ పారాయణం చేయడం, అలాగే జగన్మాత లలితాదేవి స్తోత్రాలు పఠించడం పుణ్యమన్నారు. ఈ కార్యక్రమంలో దాదాపు 50 మంది బ్రాహ్మణ సంఘం సభ్యులు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.



విష్ణు, లలితా సహస్ర నామ స్తోత్ర పారాయణం నిర్వహిస్తున్న దృశ్యం

నేడు పొలతలలో శివపార్వతుల కల్యాణం

పెండ్లిమర్రి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రమైన పొలతల మల్లికార్జునస్వామి దేవస్థానంలో మూడవ కార్తీక సోమవారం సందర్భంగా శివపార్వతుల కళ్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి మూడే కృష్ణానాయక్ తెలిపారు. ఉదయం స్వామి వారికి అభిషేకం, మధ్యాహ్నం రథోత్సవం, ముత్యాల తలంబ్రాలతో కళ్యాణం ఉంటాయని ఆయన వివరించారు.

కమలాపురం సచివాలయంలో ఆధార్ నమోదు కేంద్రాలు

కమలాపురం రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి):కమలాపురం నగర పంచాయతీలో 3,4వ వార్డుల సచివాలయాల్లో ఈ నెల 19 నుంచి 22 వతేదీ వరకు ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ జ్యోతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే 26 నుంచి 29 వరకు కోగటం, చిన్నచెప్పలి గ్రామాల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కేంద్రాల్లో 0-5 సంవత్సరాల పిల్లలకు ఆధార్ అప్‌డేట్ చేయడంతో పాటు ఆధార్ కార్డులో చిరునామా, ఫోటో మార్పు ఆధార్ ఫోను నెంబరు లింకు, వేలిముద్రలు అప్‌డేట్ చేయడం తదితర సేవలు అందిస్తామని ఎంపీడీఓ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.




శిల్పారామంలో ఆదివారం విద్యార్థుల నృత్యాలు అబ్బురపరచాయి. ఆహూతులను ఎంతగానో అలరించాయి. - కడప కల్చరల్, (ఆంధ్రజ్యోతి)

కవులను ప్రోత్సహించడం అభినందనీయం

కడప కల్చరల్, నవంబరు 17, (ఆంధ్రజ్యోతి): కవులను ప్రోత్సహించడం అభినందనీయమని ఎస్సీ సంక్షేమ జిల్లా అధికారి డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య పేర్కొన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం చిన్నచౌక్‌లోని జిల్లా ప్రధాన కేంద్ర కార్యాలయంలో బహుభాషా కవిసమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా బ్రహ్మయ్య హాజరై మాట్లాడారు.

ఏపీ యూత్ కాంగ్రెస్ జోనల్ ఇన్‌చార్జిగా విజయకుమార్

కడప కలెక్టరేట్ నవంబరు 17(ఆంధ్రజ్యోతి) ఏపీ యూత్ కాంగ్రెస్ జోనల్ ఇన్‌చార్జిగా మూరతోటి విజయ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం కాంగ్రెస్ కార్యాలయంలో పార్టీ అధ్యక్షురాలు ఎస్. డి.వి జయజ్యోతి ఆయన్ను సన్మానించారు.







ఆగని ఇసుక అక్రమ రవాణా

● అధికారుల పాత్ర ఎంత..?



కలసపాడు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కలసపాడు మండలంలో ఇసుక అక్రమ రవాణా ఆగడంలేదు. మండలంలోని గంగాయపల్లె నుంచి రెడ్డిపల్లె, ఎగువ రామాపురం, ఎగువ తంబళ్లపల్లె, సింగరాయపల్లె, దిగువ తంబళ్లపల్లె, పాత రామాపురం, సిద్దమూర్తిపల్లె గ్రామాల వద్ద ఇసుక ర్యాంప్‌లు కూడా ఏర్పాటు చేసి వైసీపీ నాయకులు ఇసుక రవాణాను పంపిణీ చేశారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత అయినా ఇసుక అక్రమ రవాణా ఆగుతుందనుకుంటే మరలా యథేచ్ఛగా రవాణా సాగుతోంది. గిద్దలూరు నుంచి సగిలేరు వాగు ప్రవహిస్తూ సిద్దవటం వద్ద పెన్నానదిలో కలుస్తుంది. ఈ వాగులో ఎర్ర ఇసుక దొరుకుతుంది. స్థానికులు ఇళ్లను నిర్మించుకునేందుకు తెల్లఇసుక కొనలేక ఎర్ర ఇసుకను వాడుతుంటారు. దీనిని దృష్టిలో ఉంచుకుని స్థానిక నాయకులు అక్రమ రవాణాకు తెర తీశారు.

ఇసుక తవ్వకాలతో తగ్గుతున్న భూగర్భజలాలు..: సగిలేరులో అక్రమంగా ఇసుక తవ్వకాలతో భూరగ్భ జలాలు తగ్గుతున్నాయి. ముఖ్యంగా గంగాయల్లె, రెడ్డిపల్లె, ఎగువతంబళ్లపల్లె, ఎగువ రామాపురం, దిగువతంబళ్లపల్లె, సింగరాయపల్లె, కలసపాడు ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. కలసపాడుకు తెలుగుగంగ నీటి ద్వారా సగిలేటిలోకి నీరు వదులుతుండడంతో మండల కేంద్రమైన కలసపాడులో కొద్దిగా భూగర్భ జలాలు ఉన్నాయి. మిగతా గ్రామాల్లో అరకొరగా నీరు వస్తున్నాయి.

ప్రమాదాలు జరిగితే ఎలా..: ఇసుక తవ్వకాలతో భారీ ఎత్తున గోతులు ఏర్పడ్డాయి. ముఖ్యంగా బ్రాహ్మణపల్లె వద్ద అయితే పెద్దచెరువులను తలపిస్తున్నాయి. వర్షాకాలంలో వర్షాలు వస్తే గోతులు కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. గతంలో కూడా ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని ఇసుక అక్రమరవాణా జరగ కుండా అడ్డుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అధికారులకు తెలిసే ఇలా..: సంబంధిత అధికారులకు తెలిసే ఇసుక అక్రమ రవాణా జరుగుతుందా అంటే అవుననే వినిపిస్తుంది, ఎప్పుడుబడితే అప్పుడు ఇసుక ట్రాక్టర్లు తిరుగుతున్నా ఏ అధికారీ పట్టించుకోక పోవడంపై పలువిమర్శలు ఉన్నాయి. ప్రతినిత్యం కలసపాడు నుంచి పదుల సంఖ్యలో ఎర్ర ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. కానీ ఎప్పుడు కూడా రవాణాను పట్టుకున్న దాఖలాలు లేవు.

దొరికితే కేసులు నమోదు చేస్తాం

ఇసుక అక్రమ రవాణా చేస్తూ దొరికితే కేసులు నమోదు చేస్తామని ఆర్‌ఐ చంద్ర తెలిపారు. ఇటీవల విజయవాడ వరద ప్రాంతాలకు వెళ్లామని, ప్రస్తుతం మేం ఎవరికీ ఇసుక రవాణాకు అనుమతి ఇవ్వలేదన్నారు .అలాగే అది ఇసుక కాదు, మట్టి అంటూ సమాధానం ఇచ్చారు. మట్టి అయినా అనుమతులు లేకుండా తోలకూడదు కదా అని అడగ్గా, తోలకూడదని, పరిశీలించి చర్యలు చేపడతామని తెలిపారు.

చంద్ర,ఆర్‌ఐ

ఎర్రగుడిపాడు రస్తాను పునరుద్ధరించండి

ఎర్రగుంట్ల నవంబరు17(ఆంధ్రజ్యోతి):ఎర్రగుంట్ల నాలుగు రోడ్ల కూడలి నుంచి పూర్వపు ఎర్రగుడిపాడు వరకు ఉన్న రస్తాను పునరుద్ధరించాలని ఎర్రగుంట్లకు చెందిన రైతులు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డిని కోరారు.ఆదివారం జమ్మలమడుగులోని కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి ఈ మేరకు వినతి ప్రత్రాన్ని ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో తాటిగొట్ల ప్రతాపరెడ్డి(కత్తి),జిల్లెల్ల రఘురామిరెడ్డి, నాగమోహన్,చంద్రశేఖర్‌రెడ్డి,రాధాకృష్ణ,మునిరెడ్డి, మౌలాలి, ఈశ్వరరెడ్డి, సుబ్బారెడ్డి.సుబ్బరాయుడు తదితరులు ఉన్నారు.

పాముకాటుకు గురైన రైతు

ముద్దనూరు నవంబరు17(ఆంధ్రజ్యోతి):మండల పరిధి తిమ్మాపురం గ్రామ పొలంలో అనపకాయలు కోస్తూ ఆదివారం నంద్యాల చిన్నప్రతాపరెడ్డి(55) పాముకాటుకు గురయ్యాడు.స్థానికుల సమాచారం మేరకు.. చిన్నప్రతాపరెడ్డి అనే రైతు పొలంలో అనపసాగు చేశాడు. అనపకాయలు కోస్తుండగా పాము కాటువేసింది.దీంతో వెంటనే 108 కు సమాచారం అందించగా ప్రమాదస్థలం చేరుకొని ఈఎంటీ శ్రీనివాసులు, పైలెట్ చంద్ర ఓబులేసు బాధితునికి ప్రథమ చికిత్స చేసి ,ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఆర్టీపీపీ విజిలెన్స్ సీఐగా నారాయణయాదవ్

ఎర్రగుంట్ల నవంబరు17(ఆంధ్రజ్యోతి):మండల పరిధి ఆర్టీపీపీ విజిలెన్స్ సీఐగా ఆదివారం నారాయణయాదవ్ బాధ్యతలు స్వీకరించారు.ఈయన ఫ్యాక్షన్ జోన్, ప్రొద్దుటూరు త్రీటౌన్, కడప రెడ్‌శాండిల్ టీంలో సీఐ పనిచేశారు. బదిలీపై ఇక్కడకు వచ్చారు.

వాల్మీకి,బోయ కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల నాగరాజుకు సన్మానం

ప్రొద్దుటూరు నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : వాల్మీకి,బోయ కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల నాగరాజుకు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి సన్మానం చేశారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నల్లబోతుల నాగరాజు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డిని కలిశారు. వాల్మీకి,బోయ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎంపిక కావడానికి సహకరించిన ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డికి నాగరాజు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఈవీ సుధాకర్‌రెడ్డి, టౌన్‌బ్యాంక్ ఛైర్మెన్ సుబ్బారెడ్డి, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్తీక వనభోజన కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

జమ్మలమడుగు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులోని ముద్దనూరు రోడ్డులో అయ్యప్పస్వామి గుడి సమీపాన శ్రీసాయి రాజరాజేశ్వరి కాలనీలో శ్రీ నాగలింగేశ్వరస్వామి ఆలయం వద్ద సోమవారం కార్తీక వనభోజన మహోత్సవాన్ని ఏర్పాటు చేసినట్లు దేవస్థాన కమిటీవారు తెలిపారు. పట్టణంలోని భక్తులు సందర్శించి స్వామివారి పూజా కార్యక్రమాల్లో పాల్గొని వనభోజనాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

ఘనంగా కార్తీక మాస వన మహోత్సవం

పోరుమామిళ్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో కార్తీక మాస వన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆదివారం పోరుమామిళ్లలోని చెరువు కట్ట సమీపంలో ఉన్న భైరవస్వామి ఆలయ సమీపంలో రాయల సేవా సమితి ఆధ్వర్యంలో కార్తీక వన మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ వన మహోత్సవాన్ని పురస్కరించుకుని పోరుమామిళ్లలో భారీ ర్యాలీ నిర్వహించారు. అడుగడుగునా కోలాట ప్రదర్శనలు చిందులేస్తూ పెద్దఎత్తున చెరువుకట్ట వరకు ఈ కార్యక్ర మం నిర్వహించారు. అనంతరం రాయల సేవా సమితి బలిజ సంఘం నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. చెరువు ఆయకట్టు కింద రైతుల భూములు పచ్చని పంటలతో సస్యశ్యామలం కావాలని పూజలు నిర్వహించారు.

పబ్లిక్, ప్రైవేటు రంగ వ్యవస్థలకు పోటీగా సహకార రంగం

ప్రొద్దుటూరు , నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పబ్లిక్, ప్రైవేటు రంగ వ్యవస్థలకు పోటీ గా సహకారరంగం నిలబడుతోందని ప్రొద్దుటూరు సహకార అధికారి సురేష్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని లింగాపురం ఆంధ్రప్రగతి రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో జాతీయ సహకార వారోత్సవాల సందర్భంగా కార్యాలయ ఆవరణలో సహకార జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో సహకార కేంద్ర ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, సబ్‌డివిజనల్ కోఆపరేటివ్ అధికారి ఎంవీ ప్రభాకర రావు, సహకార సంఘం అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి, సీఈవో రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా గౌరమ్మ నిమజ్జనం



కలసపాడు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కలసపాడులో ఆదివారం గౌరమ్మ నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. శ్రీవాసవీ మహిళా మండలి ఆధ్వర్యంలో మూడు రోజుల క్రితం పసుపుతో ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం గౌరమ్మను మహిళలు అమ్మవారిశాల నుంచి స్థానిక తెలుగుగంగ కాలువ వరకు భజనలు, గౌరమ్మ నామస్మరణతో ఊరేగింపుగా తీసుకెళ్లారు. భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తెలుగుగంగ కాలువలో నిమజ్జనం చేశారు.

రేపు మృత్యుంజయ హోమం

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక శివాలయంలో ఆరుద్ర నక్షత్రం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఛైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఈవో రామచంద్రాచార్యులు తెలిపారు. ఉదయం అగస్త్యేశ్వరస్వామి, రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం లోకకల్యాణార్థం మృత్యుంజయ హోమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

గుండె జబ్బును నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకు చేటు

ప్రొద్దుటూరు , నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గుండె జబ్బును నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకు చేటవుతుందని ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ పాతకోట శ్రీనాద్‌రెడ్డి పేర్కొన్నారు. నెహ్రూరోడ్డులో లక్ష్య కార్డియాక్, కంటి ఆసుపత్రిలో పేదలకు ప్రతి నెలా మూడో ఆదివారం కంటి,గుండె జబ్బులకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తారు. ఈ సందర్భంగా 45 మంది రోగులకు డాక్టర్ శ్రీనాథరెడ్డి ఉచితంగా పరీక్షలు చేశారు. ఇందులో 21 మందికి ఈసీజీ పరీక్షలు చేయగా మరో 9మందికి గుండె స్కానింగ్ పరీక్షలు చేసి రోగులకు తగు చికిత్స సూచనలు అందజేశారు. డాక్టర్ హరిత 32 మంది రోగులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. అలాగే రోగులకు మందులు ఉచితం గా పంపిణీ చేశారు.



గుండె పరీక్షలు చేస్తున్న డాక్టర్ శ్రీనాథరెడ్డి

వైభవంగా జ్యోతుల ఉత్సవం



జమ్మలమడుగు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలంలోని మోరగుడి గ్రామంలో ఆదివారం జ్యోతుల మహోత్సవం వైభవంగా జరిగింది. చౌడేశ్వరీదేవి ఆలయాల కమిటీవారు ఈనెల 16, 17, 18 తేదీల్లో జ్యోతుల ఉత్సవాన్ని కమిటీవారు ఏర్పాటు చేశారు. అందులో భాగంగా 16వ తేదీ శనివారం తొగటవీర క్షత్రియులు జ్యోతుల కమిటీ వారు ఘనంగాచౌడేశ్వరీదేవి బిందెసేవ కార్యక్రమం నిర్వహించారు. అదే రోజు రాత్రి అమ్మవారి ప్రతిరూపమైన చౌడేశ్వరీదేవి జ్యోతులను తయారు చేసి ఆదివారం జ్యోతులను భక్తులు ప్రదర్శనగా మేళతాళాల మధ్య గ్రామంలో మెరువణి చేశారు. ఆదివారం ఉదయం 11 గంటలకు చౌడేశ్వరీదేవి అమ్మవారి ఆలయం వద్దకు జ్యోతులను తీసుకెళ్లి ఆగమం చెల్లించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కుబడులు తీర్చుకున్నారు. కాగా సోమవారం గొడుగుల ఉత్సవం జరుగనుంది.

అవసరాలు అధికం... స్థలమేమో నిరుపయోగం

దువ్వూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): దువ్వూరులో బస్టాపు నిర్మాణం కోసం స్థలం అవసరం ఉంది. గ్రామ నడిబొడ్డున జాతీయ రహదారి పక్కనే స్థలం ఉండి కూడా అది నిరుపయోగం అయింది. దీనికి కారణం లేకపోలేదు. 30 ఏళ్ల కిందట పోలీసు క్వార్టర్స్ ఇక్కడ ఉండేవి. అవి శిథిలమైపోవడంతో నివాసాలు లేక ప్రస్తుతం వాటిని తొలగించి స్థలాన్ని చదువును చేశారు. ఇది పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఇతర శాఖల అవసరాలకు స్థలాన్ని ఇచ్చేందుకు పోలీసు శాఖ ససేమిరా అంటోంది. ఈ నేపథ్యంలో ఆ స్థలంలో బస్టాండు ఏర్పాటు చేస్తే మండలంలో 40 గ్రామాల ప్రయాణికులకు ప్రయోజనం కానుంది. ఇక్కడ ప్రైవేటు వ్యక్తుల వాహనాలు నిలబడేవి. పోలీసుశాఖ ఈ స్థలంలో వాహనాలను నిలుపరాదని వాహనదారులను హెచ్చరించింది. తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడగానే ఈ స్థలంలో బస్టాపు ఏర్పాటు చేసేందుకు నిధులు కేటాయించింది. ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ బస్టాపు నిర్మించేందుకు నిధులను సాధించారు. కొన్నేళ్లుగా ప్రయాణికులు బస్టాపు లేక ఇబ్బంది పడుతున్నారు.



గ్రామం మధ్యలో నిరుపయోగంగా ఉన్న స్థలం

కులగణన నిష్పక్షపాతంగా చేయాలి

జమ్మలమడుగు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): 59 కులాల గణాంకాలను నిష్పక్షపాతంగా సేకరణ చేయాలని ఏపీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ కోరారు. ఆదివారం జమ్మలమడుగులోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఏపీఎమ్మార్పీఎస్ నాయకులతో సమావేశం అయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లోని షెడ్యూలు కులాల వర్గీకరణకు నేటితో మూడు కమిషన్లు ఏర్పాటు జరిగిందన్నారు. ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేయడం వలన రాష్ట్ర ప్రభుత్వానికి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు తిరుమలయ్య, చర్మ కళాకారుల రాష్ట్ర కన్వీనర్ నాగభూషణం, మాదిగ జిల్లా ఉపాధ్యక్షులు తిరుమలయ్య మాదిగ, మైలవరం మండల అధ్యక్షులు విజయకుమార్, కార్యదర్శి రంగనాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ల తనిఖీ

కొండాపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నూతనంగా బాధ్యతలు చేపట్టిన జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వరరావు ఆదివారం కొండాపురం, తాళ్లప్రొద్దుటూరు పోలీస్‌స్టేషన్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లలో రికార్డులను తనిఖీ చేశారు. స్టేషన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసులు, క్రైమ్ వివరాలను ఎస్‌ఐలను అడిగి తెలుసుకొన్నారు. ఈ కార్యక్రమంలో కొండాపురం, తాళ్లప్రొద్దుటూరు ఎస్‌ఐలు విద్యాసాగర్, హృషికేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

వర్షం ధాటికి నేల వాలిన వరి

కాశినాయన నవంబరు, 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో రెండు, మూడురోజులుగా కురుస్తున్న ఓమోస్తరు వర్షం వరి రైతుకు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది.ఆరుగాలం కష్టించి పండించిన వరి చేలు చేతికి వచ్చే సమయంలో వర్షం కురవడంతో పంటంతా నేలకు పడిపోయింది.ఇంతటితో వర్షం ఆగిపోతే ఎలాగోలా పంటకోసుకొని రైతులు కొంతలో కొంతైనా బయటపడతారు. ఇలాగే మరికొన్నిరోజులు వర్షం పడితే పొలంలోనే వరి ధాన్యం మొలకలు వచ్చేప్రమాదం ఉందంటున్నారు. ఈవర్షం మూలంగా దెబ్బతిన్న వరిచేల రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు రైతన్నలు కోరుతున్నారు.



నర్సాపురం వద్ద నేలవాలిన వరిపంట

